క్లుప్తంగా

అక్టోబర్ 2 నుంచి ఆడుదాం ఆంధ్ర పోటీలు

గన్నవరం: 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను అక్టోబర్ నెలలో నిర్వహించనున్నట్లు నియోజకవర్గ క్రీడల అభివృద్ధి అధికారి ధనియాల నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను అక్టోబర్ 2 నుంచి 10వ తేదీ వరకు గ్రామ సచివాలయ స్థాయిలో, 13 నుంచి 18వ తేదీ వరకు మండల స్థాయిలో జరుగుతాయన్నారు. నియోజకవర్గ స్థాయిలో 20 నుంచి 24వ తేదీ వరకు, జిల్లా స్థాయిలో 27, 28 తేదీల్లో, రాష్ట్ర స్థాయిలో నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన క్రీడాకారులు వారి పరిధిలోని గ్రామ సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

భర్తపై వరకట్నం వేధింపు కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న భర్తపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడపకు చెందిన ఎండి.ఖాజాబీ కొద్ది సంవత్సరాల క్రితం కరీముల్లాను వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. అయితే భర్త దురలవాట్లకు బానిసగా మారి అదనపు కట్నం తీసుకురమ్మని భార్యను వేధించసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు భర్తపై వరకట్నం వేధింపు కేసు నమోదు చేశారు.

అవాస్తవాలు ప్రచారం చేయడం తగదు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక గుడివాడరోడ్డుకు చెందిన ఎరువుల వ్యాపారి కాకుల వెంకట సుబ్బారావుతో పోలీసులు బలవంతంగా లేఖ రాయించారని కొన్ని దినపత్రికలు (సాక్షి కాదు), సోషల్ మీడియాల్లో చేస్తున్న దుష్ప్రచారం పూర్తిగా అవాస్తవమని హనుమాన్‌జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి శుక్రవారం తెలిపారు. స్థానిక ఇందిరానగర్‌లో నివసిస్తున్న కాకుల తులసీరత్నంకు భర్త ద్వారా సంక్రమించిన స్థిరాస్తిలో భాగమైన గుడివాడరోడ్డులోని ఓ షాపును నాగేశ్వరరావు సోదరుడు సుబ్బారావు అద్దెకు తీసుకుని ఎరువుల వ్యాపారం సాగిస్తున్నారని, గత మూడేళ్లుగా అద్దె చెల్లించకపోవటంతో తులసీరత్నం గత నెల 20న 'జగనన్నకు చెబుదాం'కు ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ నెల 1న ఇరువురినీ ఎస్ఐ జనార్దన్ పిలిపించారని, అద్దె బకాయి రూ.1.08 లక్షలు రద్దుపర్చుకుంటానని, షాపు ఖాళీ చేసి అప్పగించాలని తులసీరత్నం కోరగా, రెండు నెలల్లో ఖాళీ చేసి అప్పగించేందుకు సుబ్బారావు అంగీకరించి, పోలీసుల సమక్షంలో ఒప్పందపత్రం రాశారని, ఎవరి బలవంతం లేదని సీఐ వివరించారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

కేసరపల్లి(గన్నవరం): తల్లీబిడ్డల ఆహార, ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కేసరపల్లి గ్రామ సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక పిలుపునిచ్చారు. గ్రామంలోని అంబేడ్కర్‌నగర్ కమ్యూనిటీ హాలులో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు టీహెచ్ఆర్ కిట్లను వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారితో కలిసి ఆమె పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పి.వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్లు, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. గన్నవరంలోని ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎంపీటీసీ సభ్యులు తిరివీధి రవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగపద్మావతి చేతుల మీదుగా కిట్లను అందజేశారు.

అంబాపురం(విజయవాడరూరల్): తల్లిపాలు పిల్లల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని మిడిల్ లెవెల్ హెల్త్ విజిటర్ భాగ్యశ్రీ అన్నారు. శుక్రవారం అంబాపురం గ్రామంలో అంగన్‌వాడీ ప్రీ ప్రైమరీ స్కూల్ వద్ద తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలతో సమావేశం నిర్వహించి తల్లిపాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ స్వర్ణకుమారి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



బాలింతలు, గర్భిణులను సన్మానిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

గన్నవరం రూరల్: వైఎస్సార్ సంపూర్ణ పోషకాహారం గర్భిణులు, బాలింతలకు వరమని జక్కులనెక్కలం సర్పంచ్ మాకుల చిరంజీవి అన్నారు. శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రం వద్ద గర్భిణులు, బాలింతలకు ఆయన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. ఉప సర్పంచ్ దేవరపల్లి కళ్యాణి, దేవరపల్లి అరవింద్, అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి, ఆశా కార్యకర్త ఆర్.నాగమల్లేశ్వరి, వలంటీర్లు పాల్గొన్నారు. కొత్తగూడెంలో సర్పంచ్ తూంపాటి రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఏడుకొండలు, గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు.

గన్నవరం రూరల్: తల్లిపాలు బిడ్డకు శ్రీరామ రక్ష అని తెంపల్లి సర్పంచ్ కొలుసు శిరీష అన్నారు. శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన తల్లిపాల వారోత్సవంలో ఆమె పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టత వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కల్పన, నాగలక్ష్మి, సుమతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరు: ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేస్తుందని ఎంపీపీ సరోజిని అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్ సంపూర్ణపోషణ, టేక్ హోమ్ రేషన్ కిట్లు బాలింతలు, గర్భిణులకు అందజేసి వారికి సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు, సీడీపీవో వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్లు పద్మాదేవి, దుర్గా దేవి, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్ పాసుల పంపిణీ

గన్నవరం రూరల్: విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ అనగాని రవి అన్నారు. మండలంలోని ముస్తాబాద, సూరంపల్లి జెడ్పీ హైస్కూళ్లలో శుక్రవారం 240 మంది విద్యార్థులకు ఎంపీపీ రవి, జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్యల ఆర్థిక సౌజన్యంతో అందజేసిన ఉచిత బస్‌పాస్‌లను జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు గొసాని పంపిణీ చేశారు.

క్రికెట్ కిట్ కొనుగోలుకు సాయం..

సూరంపల్లి జెడ్పీహైస్కూల్ విజ్ఞప్తి మేరకు తోట వెంకయ్య ఆ పాఠశాల విద్యార్థులకు క్రికెట్ కిట్ కొనుగోలు నిమిత్తం రూ.5 వేలు వితరణగా హెచ్‌ఎం హరి శరణ్‌కు అందజేశారు.

వరిలో సస్యరక్షణ చర్యలపై అవగాహన

ఉయ్యూరు: వరిలో సస్యరక్షణ చర్యలు చేపడితే దిగుబడులు ఆశాజనకంగా పొందొచ్చని ఉయ్యూరు చెరకు పరిశోధనాస్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. మండలంలోని గండిగుంట ఆర్‌బీకేలో శుక్రవారం వరిలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

గడువులోగా సర్వే పూర్తి చేయాలి

గన్నవరం: నిర్ణీత గడువులోపు సమగ్ర ఓటర్ల సర్వేను పూర్తిచేయాలని సహాయ ఎన్నికల అధికారి, తహసీల్దారు సీహెచ్. నరసింహారావు బూత్ స్థాయి అధికారులకు సూచించారు. స్థానిక కొత్తపేటలోని రోటరీ ఆడిటోరియంలో శుక్రవారం మండల స్థాయిలో బీఎల్ఓల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ హౌస్ టూ హౌస్ సర్వే చేయాలని తెలిపారు. ఎంపీడీఓ సత్యకుమార్, డీటీ అరుణ్, ఎన్నికల డీటీ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వికలాంగులకు దుస్తుల పంపిణీ

పెనమలూరు: గోసాల గ్రామంలో బేతేలు ప్రార్థన సహవాస సొసైటీ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. బిషప్ డాక్టర్ షడ్రక్ ఆధ్వర్యంలో వికలాంగులు, పేదలు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు.

సంక్షిప్త వార్తలు

కళ్లకలక నివారణ మందులు పంపిణీ

ఉయ్యూరు: స్థానిక జెడ్పీ పాఠశాలలో విద్యార్థులను లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో సమత శంకర నేత్ర చికిత్సాలయ వైద్యులు అన్నపూర్ణ, రోహిత్ శుక్రవారం పరీక్ష చేసి కళ్లకలక మందులు పంపిణీ చేశారు. నేత్ర సంరక్షణ, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, కార్యదర్శి నల్లా శ్రీనివాస్, ప్రతినిధులు ఊర కిషోర్, రామసత్యకిషోర్, వెంట్రప్రగడ బాబ్జీ, డాక్టర్ రావులపల్లి సుధాకర్ పాల్గొన్నారు.

రూ.52 లక్షలతో అభివృద్ధి పనులకు ఆమోదం

ఉంగుటూరు: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుదని ఎంపీపీ వి.సరోజిని అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉంగుటూరు మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మండల పరిషత్ నిధులు రూ.52 లక్షలతో పలు గ్రామాల్లో రహదారులు, చేతి పంపుల నిర్మాణం చేపట్టేందుకు తీర్మానం ఆమోదించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు, తహసీల్దార్ డి.వనజాక్షి, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌కు బీరువాల వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రేమల్లేలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాత అవిర్నేని వెంకటేశ్వరరావు శుక్రవారం రూ.20 వేలు విలువ చేసే రెండు ఇనుప బీరువాలను బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఎస్.లూథర్‌పాల్ దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

బోనాలతో భక్తుల సందడి

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మ అమ్మవారిని శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పాలు, పొంగళ్లతో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

98 శాతం పింఛన్ల పంపిణీ

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలో 98.23 శాతం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశామని ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు తెలిపారు. మండలంలో మొత్తం 16,407 పింఛన్లు ఉండగా వాటిలో 16,120 మందికి రూ.4 కోట్ల 48 లక్షల 68 వేల 250 పంపిణీ చేశామన్నారు.

భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఏలూరురోడ్డులో నిర్మిస్తున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయం భవన నిర్మాణానికి ప్రవాస భారతీయుడు దొడ్డ సురేష్‌రెడ్డి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని ఇటీవల అమెరికా పర్యటనకు వెళ్లిన మానవత డైరెక్టర్ జన్యావుల సత్యనారాయణ ద్వారా ఆయన పంపించారు.

డాక్టర్ సంధ్యకు సత్కారం

గన్నవరంరూరల్: మండల వైద్యాధికారిగా పనిచేసి బదిలీపై వెళ్లిన డాక్టర్ సంధ్య, ఏఎన్ఎం శివపార్వతిలను స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. మండల వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగుతో నేత్ర సమస్యలు దూరం

కంకిపాడు: ప్రొద్దుటూరులో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద శుక్రవారం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో 96 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేశారు. సర్పంచ్ ఈడా శివనాగలక్ష్మి, ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌జీవోల పోస్టర్ ఆవిష్కరణ

పెనమలూరు: ఏపీ ఎన్‌జీవో సంఘ కౌన్సిల్ సమావేశాల పోస్టర్‌ను ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి శుక్రవారం ఆవిష్కరించారు. కానూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీవో సంఘం కంకిపాడు యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు ఉండి వెంకట పురుషోత్తమరాజు, ఎం.శ్రీనివాసరావు, యూనిట్ సభ్యుల సమక్షంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- గడప గడపలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి
- రాజకీయాలకు అతీతంగా టీడీపీ కౌన్సిలర్ సుధారాణి కుటుంబానికి జరిగిన లబ్ధిని వివరించిన ఎమ్మెల్యే



టీడీపీ కౌన్సిలర్ పంద్రాజు సుధారాణి కుటుంబానికి జరిగిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: ప్రజా సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి కోరారు. పట్టణంలోని 20వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పాలన వివరించారు. ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరించి సంక్షేమ బ్రోచర్లను అందజేశారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని ఆయా శాఖల అధికారులతో అక్కడికక్కడే చర్చించి పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. అందులో భాగంగానే టీడీపీ కౌన్సిలర్ పంద్రాజు సుధారాణి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆ కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించారు. రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మీ కుటుంబానికి రూ.1.88 లక్షలు లబ్ధి అందించారని తెలిపారు. ఏజీ అండ్ ఎస్‌జీ జూనియర్ కళాశాల డైరెక్టర్ జీజేపీ వినయ్ కుమార్‌తో ప్రభుత్వం చేపట్టిన విద్యాసంస్కరణలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రజలు అందరూ సంతోషంగా ఉన్నారన్నారు. ఏ రంగంలో వ్యక్తులతో మాట్లాడినా ఆ రంగానికి జరిగిన మేలును తమకు వివరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), వైస్ చైర్మన్ అర్షతునీసాబేగం, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు గోన మదన్, గుంజా సుధాకర్‌బాబు, ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జంపాన కొండలరావు, వైఎస్సార్ సీపీ నాయకులు దాసు శ్రీనివాసరావు, ఎండీ బాషా, ప్రాకర్ల ఆంజనేయులు, వడుగుల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు పరిశీలకుడిగా బొప్పన



పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ పరిశీలకుడిగా బొప్పన భవకుమార్‌ను నియమించారు.ఈ సందర్భంగా శుక్రవారం కానూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి భవకుమార్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచి లింగాల భాస్కరరావు, నేతలు అన్నే చిట్టిబాబు, రామకోటేశ్వరరావు, వీర్ల బుజ్జి, వాణిప్రసాద్ పలువురు పాల్గొన్నారు.

దోమల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం

కంకిపాడు: దోమల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎపిడమాలజీ టీం రాష్ట్ర కోఆర్డినేటర్ మనోజ్‌కుమార్ అన్నారు. పునాదిపాడు గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. దోమల నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ లార్వా దశలోనే దోమల పెరుగుదల ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్త ప్రతి ఇంటినీ సందర్శించి ఆరోగ్య సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించాలన్నారు. దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి రామారావు, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ బి.వెంకటేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ గోపాలకృష్ణ, ఏఎన్ఎం శైలజ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి డైరెక్టర్ పీవీకే ప్రసాద్‌కు పితృ వియోగం

మంగళగిరి: సాక్షి దినపత్రిక డైరెక్టర్ పీవీకే ప్రసాద్ తండ్రి పాలడుగు మాధవరావు(92) శుక్రవారం సాయంత్రం కన్నుమూశారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గుంటూరు జిల్లా మంగళగిరిలోని కొండపనేని టౌన్‌షిప్‌లోగల కుమారుని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఈయన స్వగ్రామం కృష్ణాజిల్లా ముస్తాబాద. పశ్చిమగోదావరి జిల్లా కో–ఆపరేటివ్ బ్యాంకులో కార్యదర్శిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. మాధవరావు భార్య హైమావతి 2019లో కాలం చేశారు. ఆయనకు ఓ కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. శనివారం మంగళగిరిలో పాలడుగు అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.



పాలడుగు మాధవరావు(ఫైల్)